

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 65 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పాఠకుడా! గుర్తు పెట్టుకో! అది ప్రభవనామ సంవత్సరం క్రీ.శ. 13-10-1687 సోమవారం. చరిత్ర సృష్టింపబడిన రోజు! చరిత్ర పుటలలో బంగారు అక్షరాలతో వ్రాయబడాల్సిన రోజు! మసకబారిన కన్నులకు, నర నరాలా బానిసత్వపు మత్తెక్కిన చూపులకు, దేశ ద్రోహులకు, ధర్మ ద్రోహులకు ఈ పుణ్య భూమి వీర చరిత్ర కనబడదు. భారత వీర కుమారుల శౌర్య గాథలకు వాళ్ళు పుట్టు చెవిటి వాళ్ళు.

భరతమాత ముద్దుబిడ్డల సాహస, పరాక్రమ కాంతులకు వాళ్ళు పుట్టు గుడ్డివాళ్ళు. వంచకులకు, ఆత్మవంచకులకు ఆ చరిత్ర అంటే భయం, ద్వేషం. వాళ్ళు వీర పోరాటాలను కుట్రలుగా, త్యాగ బలిదానాలను పరాజయాలుగా భ్రమింపజేసే భ్రష్టులు!

పాఠకుడా! నువ్వొక కల్లా కపటం తెలియని అమాయకుడివి. నీకు ఇన్నాళ్ళూ చెప్పిందే నిజమని, నీవు ఇన్నాళ్ళూ విన్నదే  నిజమనుకునే బేలవు. అందుకే నీకోసం, కేవలం నీకోసమే కాలపు మంచు పరదాల మాటున దాగిన అరుణోదయ కాంతులను చూపుతున్నాను. ఏవో సరదాల కథలు నీకు చెబుతున్నాను అనుకుంటున్నావు. కాదు, కల్లల పరదాలు తొలగిస్తున్నాను. భ్రమలను తీరుస్తున్నాను. నిజాలను తేట తెల్లం చేస్తున్నాను. రా! నాతో రా! అదృష్టవంతుడివి అవుదువుగాని.

కట్టు కథలు కాదు కమనీయమైన యదార్థగాథలు చెబుతున్నాను. నేను నేపథ్యములో ఉంటూనే కొన్ని సత్యములను చెబుతున్నాను. కొన్ని మిథ్యలను తేట తెల్లములు చేస్తున్నాను. కొన్ని రహస్యములను దాచి దాచి నా గుండె బరువెక్కింది, కొద్దిగా దానిని తేలిక పరుచుకుంటాను! ఒళ్లంతా చెవులు చేసుకో. చెవులలో కాల రహస్య సారమంతా నూరిపోస్తాను. విని విషయాన్ని  గ్రహిస్తావో, విజ్ఞతతో చరిస్తావో, నీ ఇష్టము. కల్లలను నిజాలుగా భ్రమిస్తావో, విశృంఖలంగా పరిభ్రమిస్తావో! నీ స్వేచ్ఛ!

గతం శూన్యమని, చరిత్ర దైన్యమని, భవిత హైన్యమని భ్రమిస్తావో, నీ స్వేచ్ఛ! కానీ , మరలా చెబుతున్నా, నన్ను తెలుసుకో, నిన్ను తెలుసుకో, మనంతటి వాళ్ళు లేరని తెలుసుకో. తెలుసుకుంటావా? నాతో రా మరి! ఎంతో కాదు, మూడువందల ముప్పైనాలుగు సంవత్సరాల వెనక్కు నిన్ను తీసుకుపోతా. భయపడకు. మరలా నిన్ను ఇక్కడికే తెచ్చి దింపుతా. కాల రహస్య మధువు నీకై అంతా ఒంపుతా. భావి పాత్రలో అనన్య సత్యముల అమృతం నింపుతా, తాగి అమరుడవు అవుతావో, వలదని జీవన్మృతుడవు అవుతావో, నీ ప్రాప్తం!

సరే! ఇక్కడే కాలాయాపనమెందుకు, వెళ్దాం రా!

★★★★★★★★★★

'శ్రీ ప్రభవ నామ సంవత్సరే, ఉత్తరాయణే, శరదృతుః ఆశ్వీయుజ మాసే, శుక్ల పక్షే, సప్తమ్యాం, ఇందు వాసరే, శుభవాసరే ..' మధుర గంభీరమైన స్వరంతో సంకల్ప మంత్ర విధి జరుపుతున్నాడు కృష్ణరాయలు. ప్రక్కన ఆయన అర్ధాంగి లక్ష్మీబాయి కూర్చుని భర్తతో పాలు పంచుకుంటున్నది పూజలో. వారికి అభిముఖంగా అన్ని వర్ణాలకు చెందిన

గ్రామస్తులు భార్యా భర్తలు జంటలుగా కూర్చుని వారూ పూజలో పాల్గొంటున్నారు, పూజా ద్రవ్యాలూ, అమ్మవారి రూపు వున్న పళ్లెరాలతో.

తల్లి పక్కన కూర్చున్న చిన్నారి లలిత శ్రద్ధగా పూజా క్రమాన్ని గమనిస్తున్నది. మధ్య మధ్య మురిపెంగా గర్వంగా అతిథులను, ప్రత్యేకించి 'ఇర్మిన్' వైపు చూస్తున్నది. కృష్ణరాయల పక్కన ఆయన వారసుడు భవానీ ప్రసాద రాయలు కూర్చుని ఉన్నాడు. నూనూగు మీసాల నూతన యవ్వన సామ్రాజ్యానికి యువరాజులా ఉన్నాడా బుడతడు. అమ్మను పూజిస్తున్న కుమారస్వామిలా దివ్యమైన తేజస్సుతో వెలిగిపోతున్నాడు.

నవరాత్రుల ప్రారంభం రోజున సాయంత్రం సమయానికల్లా మంథని గురుకులం నుండి ముక్తివరం చేరుకున్నాడు భవానీ ప్రసాద రాయలు. మరి కొద్దిసేపటికి గురుకులానికి తిరిగి వెళ్తాడు. ప్రతి దుర్గాష్టమి నుండి విజయదశమి వరకు మూడు రోజులపాటు మంథని గురుకులంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు వుంటాయి. మహా సప్తమి పూజ చేసుకుని, సరస్వతీ స్వరూపిణి ఐన అమ్మవారి ఆశీస్సులు తీసుకుని గురుకులానికి తిరిగి వెళ్ళడం ప్రతి సంవత్సరమూ ఆనవాయితీ అతడికి.

అందరికీ స్పష్టంగా కనిపించేలా ఎత్తైన వేదిక మీద దివ్య స్వరూపంతో సింహవాహన ఐన దుర్గామాత కొలువు దీరి ఉన్నది. ఏడవ నాటి పూజ ప్రారంభం అయ్యింది. వేదికకు ఎదురుగా విశిష్ట అతిథులకు, అధికారులకు, ప్రముఖులకు, స్త్రీలకు ప్రత్యేకంగా ఆసనాలు వేసి ఉన్నాయి.

ముందు వరుసలో అంబ్రాస్ దంపతులు, వారి కుమారుడు ఇర్మిన్ ఒక వైపు కూర్చుని ఉన్నారు. అంబ్రాస్ పక్కన డచ్చి వారి దుబాసీ దామోదర శర్మ కూర్చుని ఉన్నాడు. సంకల్పం మొదలుకొని మంటపంలో జరుగుతున్న పూజా విధానాన్ని అంతరార్థాన్ని డచ్చిలో వివరిస్తున్నాడు. అటు పక్క ముందు వరుసలో స్థంభాద్రి నుండి, హైదరాబాదు నుండి వచ్చిన గోల్కొండ సామ్రాజ్యంలోని అధికారులు ఉన్నారు.

వేదిక మీద ఒక పక్కన ప్రత్యేకంగా వేసిన ఆసనాల మీద మరునాడు, దుర్గాష్టమి రోజున కుమారీ పూజ అందుకొనబోయే పదేళ్ళు నిండని బాలికలు కూర్చుని వున్నారు. వేదికమీద, వేలాదిమంది ప్రజల ఎదురుగా కూర్చోవడం, పూజ వాతావరణం అలవాటు కావడం కోసం ఒక రోజు ముందు నుండే వేదిక మీదకు వారిని వేంచేపు చేశారు.

వారందరూ పట్టు పరికిణీలతో, పసుపు, పారాణితో, పసిడి హారాలతో మిసిమి కాంతులతో మెరిసిపోతున్నారు. తమ అంద చందాలకు, అలంకరణకు తామే మురిసి పోతున్నారు. మాటి మాటికీ నగలు, బట్టలు సర్దుకుంటూ హొయలు పోతున్నారు. వేదిక కింద కూర్చున్న తల్లి తండ్రులను, బంధువులను చూస్తూ మురిపెంగా, గర్వంగా ముసి ముసి నవ్వులు కురిపిస్తున్నారు.

ఏడవ రోజున, సప్తమినాడు సరస్వతీ పూజ అమ్మవారికి పవిత్రమైన మహా స్నానంతో ప్రారంభం అవుతుంది.

అమ్మవారి ప్రతిమకు ఎదురుగా ఒక అద్దాన్ని ఉంచుతారు. అద్దంలో ప్రతిబింబించే అమ్మవారికి పవిత్రమైన నదీ జలాలతో స్నానం చేయిస్తారు. ఆ తరువాత నవపత్ర పూజ చేస్తారు. అరటి, మాను పసుపు, పసుపు, జయంతి, బిల్వ, దానిమ్మ, అశోక, రేల పత్రాలు, ధాన్యపు గింజలు ఈ తొమ్మిది నవ పత్రాలు అనబడతాయి. ముందురోజు నవ పత్రాలు మంత్ర సహితంగా దండగా కట్టి ఉంచుతారు. సప్తమినాడు నదిలోనో, పారే నీటిలోనో ఆ నవపత్ర మాలకు స్నానం చేయించి, ఎఱ్ఱని లేదా కాషాయ వర్ణపు వస్త్రం పరచిన పీఠం మీద అమ్మవారికి కుడి పక్కన ఆ మాలను ఉంచి పూజిస్తారు. బిల్వపత్రం అమ్మవారికి ప్రతీకగా భావించి, మరునాటి అష్టమి నాటి పూజకు అమ్మవారిని ఆహ్వానించడానికి సంకేతంగా బిల్వ వృక్షాన్ని, పత్రాన్ని పూజ చేయడం జరుగుతుంది.

నవపత్ర పూజ తరువాత సరస్వతీ పూజ చేసి, విశేషించి బాల బాలికలకు విద్యా బుద్ధులు ప్రసాదించాలని విన్నవించుకుంటారు. ఘంట, శూలము, నాగలి, శంఖము, రోకలి, చక్రం, ధనుర్బాణాలు ఎనిమిది చేతులలో ధరించిన తల్లీ దయ జూడమ్మా అని సాగిలబడతారు. నల్లని మబ్బు మాటునుండి వెలువడిన తెల్లని జాబిల్లి వంటి తల్లీ! మహాకాళీ స్వరూపిణి ఐన గౌరీదేవి శరీరం నుండి ఉద్భవించిన తల్లీ, తనయులను తనివి తీరా కరుణించమ్మా అని కాళ్ళ మీద పడతారు. శుంభ నిశుంభులను తుంచిన తల్లీ, మాకు శుభములు ప్రసాదించమ్మా అని ప్రార్థనలు చేస్తారు.

దామోదర శర్మ వివరణను ఆసక్తిగా వింటున్న అంబ్రాస్ దంపతుల వద్దకు పరుగువంటి నడకతో వచ్చాడు డచ్చివారి సైనికుడొకడు. అతడి ముఖంలో ఆందోళనను గమనించి వేగంగా పక్కకు తీసుకు వెళ్ళాడు అంబ్రాస్. రెండు క్షణాలు లోగొంతుకతో ఏదో చెప్పాడు ఆ సైనికుడు. అంబ్రాస్ ముఖంలో భయం, కోపం రెండూ గమనించాడు దామోదర శర్మ. అతడి మనసులో ఒక భయంకరమైన అనుమానం కలిగింది.

అంబ్రాస్ ఆత్రుతగా పక్కకు వెళ్లడంతో కొడుకును దగ్గరకు లాక్కుంటూ భర్తను సమీపించింది 'లేడీ హాలె'. వారి సంభాషణ విని, విషయం గ్రహించడంతోనే ఆమె అందమైన ముఖం తెల్లగా పాలిపోయింది.

భయంతో తీగవంటి ఆమె శరీరం కంపించిపోవడం గమనించాడు దామోదర శర్మ. ఆ సమయానికి నివేదన, హారతి పూర్తి అయ్యాయి. మిగిలిన క్రియా కలాపాన్ని పూర్తి చేసి, తీర్థ ప్రసాదాలు చప్పున తీసుకున్నాడు కృష్ణ రాయలు. దేవీ మూర్తికి నమస్కరించి దూకినట్లుగా వేదిక దిగాడు. రెండు అంగల్లో అంబ్రాస్ దంపతులను సమీపించాడు. అంబ్రాస్ భుజం మీద చేయి వేశాడు భరోసా ఇస్తున్నట్లుగా.

ఉరుములాగా కృష్ణరాయల కంఠం మోగింది. అక్కడక్కడా ఆకతాయిలను ఒక కంట కనిపెడుతూ ఉత్సవాలకు రక్షణగా కాపలా కాస్తున్న కృష్ణరాయల భటులు పాతికమంది రెండు క్షణాలలో అక్కడికి చేరుకున్నారు. వేదిక వద్ద సిద్ధంగా ఉన్న కృష్ణరాయల అంగరక్షకులు పదిమంది పరుగునా వచ్చారు.

దామోదర శర్మతో ముక్తసరిగా చెప్పాడు కృష్ణరాయలు. డచ్చిలో దాన్ని అంబ్రాస్ చెవుల వేశాడు దామోదర శర్మ.

'కంగారు పడవద్దు. వందమంది సైనికులు, పాతికమంది నా అంగరక్షకులు సిద్ధంగా ఉన్నారు. మీ వెంట రక్షణగా నాగులవంచకు వస్తారు. మీ శరీరం మీద ఈగ కూడా వాలకుండా చూసుకుంటారు. నాగులవంచలో మిగిలిన వారి సంగతి నేను చెప్పలేను. దుర్మార్గులకు శిక్ష తప్పదు. అమ్మ దయ! పరిస్థితులు చక్కబడి, మీరు తిరిగి వచ్చేవరకూ లేడీ హాలె, ఇర్మిన్ ఇక్కడే నా కోటలో సురక్షితంగా ఉంటారు' కృష్ణరాయల సందేశాన్ని విన్నది విన్నట్టుగా విన్నవించాడు దామోదర శర్మ.

భార్యను, కుమారుడిని రెండు చేతులతో దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకున్నాడు అంబ్రాస్. ధైర్యం చెప్పి వీడుకోలు పలికాడు. దుర్గమ్మకు, కృష్ణరాయలకు మౌనంగా, దీర్ఘంగా నమస్కరించాడు. మరి కొన్ని నిముషాలలో రెండు పల్లకీలలో కృష్ణరాయల కోటవైపు అంబ్రాస్ భార్యా పిల్లలు, కృష్ణ రాయల భార్యా పిల్లలు వెళ్ళిపోయారు.

కృష్ణ రాయల అంగరక్షకులు పాతికమంది, సైనికులు వందమంది ముందూ వెనుకగా రక్షణగా వెంట రాగా గుర్రం మీద వేగంగా కదిలాడు అంబ్రాస్. అతడిని అనుసరించబోయిన దామోదర శర్మను వారించి తన కోటకు

పంపించాడు కృష్ణరాయలు. పదిమంది సైనికులను తిరునాళ్ళలో డచ్చి వారు నిర్వహిస్తున్న అంగడికి రక్షణగా కాపలాకు పంపించాడు.

తీర్థ ప్రసాద వితరణ ముగిసి, చూస్తూండగానే ఉత్సవ వేదిక సద్దుమణిగింది. జన సమ్మర్దంతో కిట కిట లాడిన పందిళ్ళు బోసిపోయాయి. వేదికకు రక్షణగా ఉన్న సైనికులను, అఖండ దీపానికి బాధ్యులుగా /ఉన్న అర్చకులను చూస్తూ ఆలోచనలో పడిపోయాడు కృష్ణరాయలు. అఖండ దీపపు ఎఱ్ఱని కాంతులు రాక్షసుల రక్తంతో తడిసిన అమ్మవారి ఖడ్గం చంద్రహాసం అంచుల్లా  మెరుస్తున్నాయి. నేల అంతా రక్తం పారుతున్న ఎఱ్ఱని ప్రవాహంలా, స్వేచ్ఛా శిశువును ప్రసవించబోయే  నాగులవంచ నడిబొడ్డులా కనిపిస్తున్నది.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS